క్లుప్తంగా

హరీశ్‌రావును కలిసిన మహిపాల్‌రెడ్డి



హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ విజయానికి సంపూర్ణ సహకారం అందించిన హరీశ్‌రావుకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని, అందరికీ అండగా ఉంటామన్నారు.

ప్రజాతీర్పును స్వాగతిస్తున్నా



నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో పటాన్‌చెరు ప్రజల తీర్పును స్వాగతిస్తున్నానని ఎస్ఎంఆర్ యువసేన అధ్యక్షుడు, బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసిన నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆయా పార్టీలు టికెట్ కేటాయిస్తామని చెప్పి కాలయాపన చేశాయని, తక్కువ సమయంలోనే ప్రచారం చేసిన తనకు 46,059 ఓట్లు వచ్చాయన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు అధికారంలోనే ఉండాల్సిన అవసరం లేదని, తనను నమ్మి ఓటు వేసిన ప్రతిఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మీ బిడ్డగా.. ముమ్ముందు కూడా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు, కార్యకర్తలు అధైర్యపడొద్దన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తూ అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉందామని సూచించారు.

దేవతామూర్తులకు పూజలు

మునిపల్లి(అందోల్): కార్తీకమాసం సందర్భంగా దేవతామూర్తులకు మూడవ సోమవారం సందర్భంగా భక్తులు దీపాలను వెలిగించారు. మక్తక్యాసారం ఆత్మానందాశ్రమంలో మదనానంద సరస్వతిస్వామి, భగవద్భక్త పరాగ పూజ్య పాద రాజయోగి వెంకటస్వామి గురుమూర్తులకు పాద పూజ చేసి దీపోత్సవాన్ని నిర్వహించారు. అదేవిధంగా బుదేరా బ్రమరాంభ మల్లికార్జునస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మానవత్వం చాటుకున్న ఐకేపీ సిబ్బంది



ఆర్థికసాయం అందజేస్తున్న సిబ్బంది

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అనారోగ్యంతో బాధపడుతున్న మండల పరిధిలోని ఎట్టిగడ్డ సంఘం గ్రామానికి చెందిన ఐకేపీ వీఓఏ మల్లేశంకు సోమవారం తోటి సహద్యోగులు ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఐకేపీ వీఓఏలు, సీసీలు, ఏపీఎం కలిసి రూ 27,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు.

7న కార్తీక దిపోత్సవం

నారాయణఖేడ్: ఖేడ్ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 7న కార్తీకమాసాన్ని పురస్కరించుకొని కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, ఉమా మహేశ్వర కల్యాణమహోత్సవం, కార్తీక దీపోత్సవం, మహాహారతి, అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. హైదరాబాద్‌కు చెందిన నరసింహాచే సంగీత విభావరి తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గెలుపోటములు బీఆర్‌ఎస్‌కు కొత్తకాదు

- అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి కోరారు. సోమవారం గజ్వేల్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ నేతలు తమ మాటను నిలబెట్టుకోవాలన్నారు. అదేవిధంగా రైతులకు యాసంగి పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించాలని కోరారు. నియోజకవర్గంలో ప్రస్తుతం రూ.250 కోట్ల పనులు ప్రగతి పథంలో ఉన్నాయని, వాటిని పూర్తి చేయడానికి కాంగ్రెస్ సహకరించాలని కోరారు. గజ్వేల్‌ను అభివృద్ధిలో యాభైఏళ్ల ముందుకు తీసుకెళ్లిన ఘనత కేసీఆర్‌కు దక్కిందని, ఈ క్రమంలో ఆయనకు ప్రస్తుత ఎన్నికల్లో 45 వేల పైచిలుకు మెజారిటీ అందించడం హర్షణీయమన్నారు.

పత్తిపై అతివృష్టి పడగ

- రోజు రోజుకూ పడిపోతున్న ధర
- ధర పెరుగుదలకు రైతుల ఎదురుచూపు
- సీసీఐలో క్వింటాలు పత్తికి రూ.7,020 మాత్రమే



పత్తి చేనులో దిగాలుగా కూర్చున్న రైతు (ఫైల్)

మునిపల్లి(అందోల్): వ్యాయ ప్రయాసల కోర్చి రైతన్న పండించిన పత్తి పంటకు ధర లేకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కురుకుపోయే పరిస్థితి ఏర్పడింది. క్వింటాల్ పత్తికి సీసీఐలో రూ.7.020 పలికిన ధర ప్రస్తుతం పత్తి వ్యాపారస్తులు రూ.6.800 చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. దీంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. పంట దిగుబడి కోసం ఎకరాకు 25 వేల నుంచి 30 వేల వరకు పెట్టుబడి పెట్టారు. దీంతో ఎకరాకు 8 నుంచి 12 క్వింటాళ్లు వస్తుందనుకున్న పత్తి వజను 3 నుంచి 5 క్వింటాళ్ల పత్తి వజను రావడంతో రైతులు అయోమయంలో పడ్డారు. దీనికి తోడు పత్తి పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో పత్తి పంటను కూలీలతో తీయించి ఇంట్లో నిల్వ చేసే పనిలో నిమగ్నమయ్యారు.

తరుగు పేరిటా మోసం

పంట చేతికొచ్చే సమయంలో వ్యాపారులు రైతులను నిలువునా దోచుకుంటున్నారన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. అరువుకు విత్తనాలు, ఎరువులు, పిచికారీ మందు దొరకడంతో రైతులు కావల్సిన అన్ని రకాల మందులను (ఉద్దెరా) తీసుకున్నారు. దీంతో వ్యాపారులకు రైతుల నుంచి వడ్డీకి వడ్డీ, కమీషన్‌కు కమీషన్ రెండూ దక్కుతున్నాయి. గ్రామాల్లో కొనుగోలు చేసే పత్తికి నాణ్యత పేరిటా 1 నుంచి 2 కిలోల మొగ్గు (తరుగు) తూకం వేస్తున్నారు. మార్కెట్ ధర కన్నా గ్రామాల్లో కొనుగోలు చేసే పత్తికి ధర తక్కువ చెల్లించడం, తూకంలో రాళ్లతో వ్యత్యాసం రైతన్నల నడ్డి విరుస్తోంది. పత్తి తీసేందుకు కూలీలు కిలోకు రూ.10 చొప్పున రెండు తెంపులు కూలీలు పత్తి తీయాల్సి ఉంటుందని రైతులు ఒప్పందం చేసుకున్నారు.

కూలీలకు అడ్వాన్సులు



ఇతర ప్రాంతాల నుంచి పత్తి తీసేందుకు వచ్చే కూలీలకు ముందే అడ్వాన్సు ఇస్తాం. కూలీలకు అవసరమైన సమయంలో పత్తి తీసేకొద్ది కూలి ఎప్పటికప్పుడు అందజేస్తాం. పత్తి తీసిన తర్వాత కూలీల లెక్క చేసి అంతా ఒకేసారి డబ్బులు చెల్లిస్తాం.

– గుంతలి నర్సింహులు, రైతు

గిట్టుబాటు ధర కల్పించాలి



క్వింటాల్ పత్తికి రూ.12.500 గిట్టుబాటు ధర కల్పించాలి. వర్షాలు లేక ఎండలకు అంతత మాత్రంగా పండిన పత్తికి ప్రభుత్వ గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి. పత్తిని ప్రభుత్వమే కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి.

– బోయిని విఠల్, రైతు

ప్రభుత్వం అవకాశం కల్పించింది



పత్తికి గిట్టుబాటు ధరను కల్పించే నిర్ణయాధికారం ప్రభుత్వాలపై ఉంది. పత్తి దిగుబడి కోసం రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తాం. సీసీఐ కేంద్రాల్లో పత్తి పంటను అమ్ముకోవడానికి రైతులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

– నర్సింగ్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

రిటర్నింగ్ అధికారిపై ఫిర్యాదు చేస్తా

కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న కాటా శ్రీనివాస్‌గౌడ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పటాన్‌చెరు నియోజకవర్గ ఓట్ల లెక్కింపులో అనేక అనుమానాలు ఉన్నాయని, దీనిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికలు జరగలేదన్నారు. ఓట్ల లెక్కింపులో అనేక అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. ఈ విషయంపై రిటర్నింగ్ అధికారి వద్దకు వెళ్లి రీకౌంటింగ్ చేయాలని కోరినా పట్టించుకోలేదన్నారు. 12 గ్రౌండ్ నుంచి 18 రౌండ్ల వరకు ఓట్ల లెక్కింపుపై తమకు అనేక అనుమానాలు ఉన్నాయని, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో సైతం పై రౌండ్‌లకు సంబంధించిన ఓట్ల లెక్కలు లేవని తెలిపారు. నియోజకవర్గంలో పోలైన ఓట్లకు, అధికారుల ప్రకటించిన ఫలితాలకు వ్యత్యాసం ఉందన్నారు. కొన్ని బాక్స్‌లు ముందే తెరిచి ఉన్నాయన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఉదయం లెక్కించకుండా మధ్యాహ్నం లెక్కించి తమ పార్టీ ఏజెంట్లను పక్కదోవ పట్టించారని ఆరోపించారు. తమ ఏజెంట్లు పలుమార్లు రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని వాపోయారు. రిటర్నింగ్ అధికారిపై ఫిర్యాదుతో పాటు రీకౌంటింగ్ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. గత ఎన్నికల కన్నా ఈ ఎన్నికల్లో మరింత మెజార్టీని ఇచ్చిన నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన పేదలందరికీ అందేవిధంగా కృషి చేస్తానని చెప్పారు.

ఆ ముగ్గురూ ప్రతిపక్షంలోనే..



ఫరీదుద్దీన్



గీతారెడ్డి



మాణిక్‌రావు

జహీరాబాద్: అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందిన పలువురు ఎమ్మెల్యేలు ప్రతిపక్షంలోనే కూర్చోవాల్సి వచ్చింది. అందుకు కారణం వారి పార్టీ రాష్ట్రంలో అధికారంలో లేకపోవడమే. 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఎండీ ఫరీదుద్దీన్ పోటీ చేసి గెలుపొందారు. అప్పట్లో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంది. దీంతో ఆయన ప్రతిపక్షంలో కూర్చున్నారు. 2014 ఎన్నికల్లో గీతారెడ్డి కాంగ్రెస్ తరపున గెలుపొందారు. అప్పట్లో రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో గీతారెడ్డి ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చింది. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో మాణిక్‌రావు బీఆర్‌ఎస్ తరపున పోటీ చేసి గెలుపొందారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో మాణిక్‌రావు ప్రతిపక్షంలోనే ఉండనున్నారు.

ఆలయాలకు కార్తీక శోభ



ఉమామహేశ్వర దేవస్థానంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని వీరన్నగూడ గ్రామంలోని భద్రకాళీసమేత వీరభద్రస్వామి దేవాలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలో అభిషేకాలు, అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చనలు చేశారు. దేవాలయ ఈఓ శశిధర్, నిర్వహకులు సోమయ్య ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. స్వామివారి ధ్వజస్తంభం వద్ద భక్తులు దీపాలను వెలిగించి మొక్కులను తీర్చుకున్నారు. సత్యనారాయణస్వామి వ్రతాలను చేపట్టారు.

అన్నపూర్ణేశ్వరుడిగా ఉమామహేశ్వరుడు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు జేపీ కాలనీలోని ఉమామహేశ్వర ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని శివునికి పంచామృతంతో తయారు చేసిన అన్నాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా రామలింగేశ్వర దేవస్థానంలో మహాదేవుడికి లక్ష పుష్పార్చన చేశారు. నిర్వహించారు. జేపీ కాలనీలోని ఉమామహేశ్వర దేవస్థానంలో శివలింగాన్ని కైలాస మంచుకొండలా అలంకరించారు. అనంతరం స్వామివారికి 12 రకాల హారతులు ఇచ్చారు.

ముమ్మరంగా నర్సరీ పనులు



పనులను పరిశీలిస్తున్న టీఏ గణేశ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): నర్సరీ పనులు ముమ్మరం చేశామని, వర్షకాలం సీజన్ వచ్చేసరికి మొక్కలు సిద్ధం చేసేలా ప్రణాళిక చేపట్టామని పంచాయతీ కార్యదర్శి తిరుపతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో జరుగుతున్న నర్సరీ పనులను కార్యదర్శి తిరుపతి, టీఏ గణేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన నర్సరీలో 16 వేల మొక్కల తయారీకి పాలిథిన్ కవర్లలో మట్టి నింపించామన్నారు. నర్సరీ పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్‌రెడ్డి ఉన్నారు.



కొనసాగుతున్న పనులు

రోడ్డుకు మరమ్మతులు

శివ్వంపేట(నర్సాపూర్): నర్సాపూర్ – తూప్రాన్ ప్రధాన హైవే పలుచోట్ల గుంతల మయంగా మారిన విషయం గురించి 'సాక్షి' దినపత్రికలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. అందుకు సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చి వేయడంతో పాటు బీటీరోడ్డు వేసే పనుల్లో నిమగ్నయ్యారు. గుంతలు పూడ్చి రోడ్డు మరమ్మతులు చేస్తుండడంపై వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్ నాయకుల పూజలు



పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా సునీతారెడ్డి గెలుపొందడంతో మండలంలోని పలు గ్రామాల నాయకులు తునికి నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ డైరెక్టర్ అంజాగౌడ్, మాజీ ఎంపీటీసీ శంకర్‌గౌడ్, కొండల్‌రావు, మల్లేశ్‌యాదవ్, రామాంజనేయులు తదితరులు నల్లపోమ్మకు పూజలు చేశారు. సునీతారెడ్డి గెలుపుకోసం కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సునీతారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



సునీతారెడ్డిని సన్మానిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): నర్సాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన సునీతారెడ్డికి సోమవారం పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిధిలోని గోమారంలోని ఆమె నివాసంలో జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ శ్రేణులు శాలువాతో సన్మానించారు. సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్యరెడ్డి, ఎంపీటీసీ నర్సింహరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌లు విజయం సాధించిన ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. నియోజకవర్గంలోని పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తన విజయం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం

మండల కేంద్రం శివ్వంపేట మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సునీతారెడ్డిని సోమవారం సన్మానించారు. గోమారంలోని ఆమె స్వగ్రామంలో విలేకరులు కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వివిధ పత్రికల్లో పనిచేస్తున్న విలేఖర్ల సమస్యలు పరిష్కరించడంలో తనవంతు కృషి చేస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రవి, గౌరవ అధ్యక్షులు మల్లేష్, అబ్దుల్ అజీజ్, ఉపాధ్యాక్షులు నట్‌రాజ్‌గౌడ్, రాజు ప్రధాన కార్యదర్శి పోచగౌడ్, సలహాదారుడు బాలేశ్, కోశాధికారి మహేశ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శి కిషోర్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు సురేశ్, ప్రకాశ్, వెంకటస్వామి, విరేశ్ ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీదే హవా

- ఐదు మండలాల్లో ఆధిక్యం
- రెండు మండలాల్లోనే బీఆర్‌ఎస్‌కు..
- ఓటుహక్కు వినియోగించుకున్న 1,92,478 మంది ఓటర్లు



నారాయణఖేడ్ : పోలింగ్ బూత్‌లో బారులుతీరిన ఓటర్లు (ఫైల్)

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని మొత్తం 7 మండలాల్లో ఐదు మండలాల్లో కాంగ్రెస్ పార్టీనే ఆధిక్యాన్ని పొందింది. కేవలం రెండు మండలాల్లోనే బీఆర్‌ఎస్ స్వల్ప మెజార్టీ దక్కించుకుంది. ఖేడ్ నియోజకవర్గంలో 2,31,198 మంది ఓటర్లు ఉండగా 1,92,478 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇందులో కాంగ్రెస్ అభ్యర్థి సంజీవరెడ్డికి 91,373 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డికి 84,826 ఓట్లు, బీజేపీ అభ్యర్థి జన్‌వాడే సంగప్పకు 7,706 ఓట్లు పోస్టల్ బ్యాలెట్లు కలుపుకొని ఓట్లు పొందారు. మండలాల వారీగా పరిశీలిస్తే సిర్గాపూర్ మండలంలో కాంగ్రెస్‌కు 9,466, బీఆర్‌ఎస్‌కు 8,718ఓట్లు లభించాయి. ఈ మండలంలో కాంగ్రెస్ 748 ఓట్ల ఆధిక్యతను సొంతం చేసుకుంది. పెద్దశంకరంపేట మండలంలో కాంగ్రెస్ 13,176, బీఆర్‌ఎస్ 11,363ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 1,813ఓట్ల ఆధిక్యత లభించింది. ఉమ్మడి నారాయణఖేడ్ మండలంలో కాంగ్రెస్‌కు 25,163, బీఆర్‌ఎస్‌కు 22,445 ఓట్లు రాగా కాంగ్రెస్ 2,718 ఓట్ల ఆధిక్యాన్ని పొందింది. ఇక మనూరు మండలంలో కాంగ్రెస్‌కు 10,250 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 8,774 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ 1,476 ఓట్ల ఆధిక్యం సొంతం చేసుకుంది. నారాయణఖేడ్ పట్టణంలో 17,213ఓట్లకుగాను 11,244మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇందులో కాంగ్రెస్‌కు 5,590, బీఆర్‌ఎస్‌కు 4,432 ఓట్లు రాగా కాంగ్రెస్ 1,158 ఓట్ల ఆధిక్యాన్ని సొంతం చేసుకుంది. కంగ్టి మండలంలో కాంగ్రెస్‌కు 13,171 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 12,590 ఓట్లు, కాంగ్రెస్ 581ఓట్ల ఆధిక్యత పొందింది. కల్హేర్ మండలంలో కాంగ్రెస్‌కు 10,039 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 10,750 ఓట్లు పొందగా 711ఓట్ల ఆధిక్యాన్ని బీఆర్‌ఎస్ సొంతం చేసుకుంది. నాగల్‌గిద్ద మండలంలో కాంగ్రెస్ 9,016 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 9,875 ఓట్లు పొందగా ఇక్కడ బీఆర్‌ఎస్ 859 ఓట్ల ఆధిక్యతను సొంతం చేసుకుంది.

కాంగ్రెస్‌కు దన్నుగా నిలిచిన చిన్న గ్రామాలు

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని తక్కువ ఓటర్లుగా ఉన్న గ్రామాలైన గట్‌లింగంపల్లి, దోసపల్లి, ఇస్లాంపూర్ గ్రామాలు కాంగ్రెస్ పార్టీకి దన్నుగా నిలిచాయి. గ్రామాల్లో నమోదయిన ఓటను పరిశీలిస్తే గట్‌లింగంపల్లిలో 126 ఓటర్లు ఉండగా ఇందులో కాంగ్రెస్‌కు 81 ఓట్లు పోల్ కాగా ఆ పార్టీకి 45 ఓట్లు లీడ్‌రావడం జరిగింది. ఇస్లాంపూర్ గ్రామంలో 122 ఓట్లు పోల్ కాగా ఇందులో కాంగ్రెస్‌కు 68 ఓట్లు రావడం జరిగింది. దోసపల్లి పంచాయతీలో చూస్తే 311ఓట్లు పోల్ కాగా కాంగ్రెస్‌కు 180 ఓట్లు రావడంతో 51 ఓట్ల లీడ్ కాంగ్రెస్‌కు వచ్చింది.

15న కొబ్బరికాయల వేలం పాట

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాయంలో కొబ్బరికాయలు విక్రయించేందుకు ఈ నెల 15న వేలం పాట నిర్వహించనున్నట్లు దేవాలయ ఈఓ శశిధర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆటో బోల్తా

చిన్నశంకరంపేట(మెదక్): మోడల్ స్కూల్ దారిలో గుర్తు తెలియని ఆటో బోల్తాపడిన సంఘటన మండల కేంద్రం చిన్నశంకరంపేటలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోడల్ స్కూల్ దారిలోకి వచ్చిన ఆటో రోడ్డు కిందకు పడిపోవడంతో బోల్తాపడింది. అర్ధరాత్రి సమయంలో సంఘటన జరిగినట్లు కాలనీ వాసులు తెలిపారు. ఇదే సమయంలో జేసీబీ నిర్వాహకుల బైక్ కన్పించకుండా పోవడం, ఆటో కోసం సోమవారం రాత్రి వరకు కూడా ఎవరు రాకపోవడంతో అనుమానాలు నెలకొన్నాయి.

క్రీడాకారులు ప్రతిభ చాటాలి



క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రెస్‌ను అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

గజ్వేల్‌రూరల్: క్రీడాకారులు ప్రతిభను చాటాలని క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఎస్‌కే హైదర్‌పటేల్ అన్నారు. జగదేవ్‌పూర్ మోడల్ స్కూల్ క్రీడాకారులకు సోమవారం క్రీడాజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డ్రెస్‌లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడల్లో రాణించే వారికి తమవంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా రాష్ట, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్న క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో జగదేవ్‌పూర్ మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ అనంతరాములు చారి, క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ సెక్రటరీ గోవర్దన్‌రెడ్డి, సభ్యులు విజయరేఖ, నవీన్, నాగేష్‌కుమార్, క్రీడాకారులు సందీప్, కిరణ్, భాను తదితరులు పాల్గొన్నారు.

కోరం కోసం పడిగాపులు

- ఎట్టకేలకు తూతూమంత్రంగా మండల సమావేశం పూర్తి

నర్సాపూర్ రూరల్: ప్రజల సమస్యల కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ప్రతీ మూడు నెలలకోసారి ఏర్పాటు చేసే మండల సర్వసభ సమావేశానికి కోరం సభ్యులు కరువయ్యారు. సోమవారం నర్సాపూర్ ఎంపీపీ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ జ్యోతి సురేశ్ అధ్యక్షతన నిర్వహించేందుకు ఎంపీడీఓ మార్టిన్ లూథర్ అధికారులతో ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశానికి ఉదయం 10 వరకు మండలంలోని 10 మంది ఎంపీటీసీలు, 34 మంది, సర్పంచ్‌లు, 18 శాఖల అధికారులు రావాల్సింది. సమయానికి వైస్ ఎంపీపీ నర్సింగ్ రావు, ఎంపీడీఓ మార్టిన్ లూథర్, ఆరు మంది సర్పంచ్‌లు, ఒక ఎంపీటీ సభ్యురాలు, కొన్ని శాఖల కింది స్థాయి అధికారులు మాత్రమే వచ్చారు. మరికొద్ది సేపటికి ఎంపీపీ, మరో ఐదు మంది సర్పంచ్‌లు వచ్చారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఒక ఎంపీటీసీకి తోడు మరో ఇద్దరు ఎంపీటీసీలు హాజరైతే కనీసం కోరం పూర్తవుతుందని దీంతో సమావేశం ప్రారంభించవచ్చని ఎంపీడీఓ తెలిపారు.

కోరం కోసం తప్పని నిరీక్షణ

కోరంకు కావాల్సిన ఇద్దరు ఎంపీటీసీలు రాలేదు. మూడు గంటల నిరీక్షణ తర్వాత ఇద్దరు ఎంపీటీసీలు రాగ అప్పటికే కొన్ని గంటలు పాటు నిరీక్షించిన సర్పంచ్‌లు, అధికారులు వెళ్లిపోయారు. ఉన్న కొద్ది మందితో తూతూమంత్రంగా సమావేశం పూర్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని తాగునీరు, విద్యుత్, రోడ్లు, కాల్వల నిర్మాణం, నిర్వహణ ఇతర సమస్యలపై చర్చించాల్సి ఉంటుంది. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రజలతో ఎన్నుకోబడిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సర్వసభ్య సమావేశానికి హాజరు కాకపోవడం సర్వసాధారణంగా మారింది. ఈ విషయమై ఎంపీడీఓ మార్టిన్ లూథర్‌ను వివరణ కోరగా.. మండలంలోని 10 మంది ఎంపీటీసీ సభ్యులు, 34 మంది సర్పంచ్‌లకు మూడు నెలలకు ఒకసారి వారం ముందుగానే ఎజెండా పంపుతామని తెలిపారు. ఆయా కారణాలతో రాలేకపోతున్నట్లు సమాచారం ఇస్తున్నట్లు చెప్పారు.